పిల్లలు పెద్దవాళ్ళ జోలికి పోరు. పిల్లలతోనే ఆడుకుంటారు.

గాలిపిల్లలు అల్లరిచూచి ముసలాయన తనలో తాను నవ్వుకొంటాడేగాని వాళ్ళ నేమీ అనడు.

పలుకురాణి కథ

భూదేవి గాలిదేవుణ్ని పెళ్లి చేసుకున్నది. అది ఇప్పటి సంగతి కాదు. ప్రపంచం పుట్టిన మొదటిరోజులలో ఆ పెళ్ళి జరిగింది. అప్పటికి భూదేవి వయసు కన్య. గాలిదేవుడూ చిన్నవాడే!

ఆమె ఆకుపచ్చని చీరకట్టి సిగలో రకరకాల పూలు పెట్టుకొని గంధం పూసుకొని ఎన్నో సొమ్ములను అలంకరించుకొని, పెళ్ళికూతురై కూర్చున్నది.

ఆ పెళ్ళికి చాలామంది ముత్తయిదువులు పేరంటానికి వచ్చారు. గులాబి. చేమంతి, మాలతి, విరజాజి, గన్నేరు సంపెంగ. పారిజాతం మొదలైన పుష్పకన్యలంతా రంగు రంగుల చీరెలను కట్టుకొనివచ్చారు

భూమిమీదనున్న చెట్లన్ని చిగిర్చినవి. ప్రతి చెట్టూ ఆకులతోనూ, చిగుళ్లతోనూ, ఫలాలతోనూ అలంకరించుకొన్నది. మల్లెలు, మొల్లలు, పారిజాతాలు మొదలైన పుష్పాలు సువాసనలతో పుడమి అంతా ఘుమ ఘుమలాడి పోయింది.

ప్రకృతి అంతా ఆనందంతో ఊగిపోయింది. కుందేళ్లూ, లేళ్లూ, సంతోషంతో గంతు లేసినవి. పక్షులు వీన సొంపుగా మంగళహారతులు పాడినవి. ఎక్కడ చూచినా సంతోషమే! సెలయేళ్ళు వాగులు జివకలు గంతువేస్తూ ఉరకలు పెడుతూ జల జల ప్రవహించినవి. వృషభములు ఆనందంతో పొంగి పోయి 'అంబా' అంటూ రంకెలు పెట్టినవి. కప్పలు బెక బెక మని డప్పులు వాయించినవి నెమళ్ళు నృత్యము చేసినవి— అతి వైభవంగా జరిగిపోయింది ఆ పెళ్ళి.

గాలి దేవుడుకూడా చక్కగా అలంకరించుకొన్నాడు. పెళ్ళికూతురు గుచ్చి ఇచ్చిన పూల మాలలను మెడలో వేసుకొన్నాడు అప్పటికి ఆయనకు గడ్డం లేదు. చిన్నవాడు కాబట్టి పుష్పకన్యలతో ఆయన ఒంటిమీద సుగంధాలు మంచి పరిమళముల నిచ్చే పుప్పొడులూ చల్లారు ఘుమఘుమలాడుతూ ఆయన 'అక్కడనుంచి ఇక్కడకూ ఇక్కడనుంచి అక్కడకు తిరగడము సాగించాడు. ఆ చెట్టు దగ్గరకు వెళ్ళి ఏమో చెప్పనూ ఈ లతదగ్గరకు చెవులో ఏదో ఊదనూ ఇదీ ఆయన వరస.

ఆరోజున పొద్దస్తమానము పెళ్ళిసంబరాలు జరిగినవి. చీకటి పడ్డ తరువాత అంతా నిద్రపోయినారు.

భూదేవి గాలిదేవుడూ భార్యాభర్తలుగా కొన్నాళ్ళు కాపరం చేసినతరువాత వారికి ఒక బిడ్డ కల్గింది. ఆమెకు పలుకు రాణి అని పేరు పెట్టారు.

పలుకురాణి చక్కనిచుక్క. ఆమె చెక్కిళ్ళపై గులాబీలు పూసినవి. తుమ్మెద రెక్కల చక్కని నలుపు ఆమె

కేశములకు అబ్బినది. ఆమె పెదవులు మామిడి చిగుళ్ళు ఆ పెదవులపై చిరునవ్వొక్కటి ఎప్పుడూ మెరుస్తూ ఉంటుంది. ఆమె గాలిలో తేలిపోగలదు. నీటిపై నడువగలదు ఎంత దూర ప్రదేశాలకైనా ఇట్టే పోగలదు.

మేఘాలకు రాజు ఇంద్రుడు. మేఘాలన్నీ ఇంద్రుడు చెప్పినట్లు వింటవి. మీరు వెళ్ళి ఆ కొండపైని వర్షం కురవండి అంటే కురవాలిసిందే! వద్దుఅంటే మానవలసిందే!... గాలిదేవుడుకూడా ఆయన మాట కాదనడు.

పలుకురాణిని గురించి ఇంద్రుని భార్య, ఇంద్రాణి విన్నది పలుకురాణి మిక్కిలి సౌందర్యవతి యని ఆమెకు తెలిసిది. ఆమె ఎప్పుడూ, జాజులు, మల్లెలు, పొగడలు, గోరంటలు తంగేడులు పూచిఉన్న ఉద్యాన వనములలో తిరుగుతూ ఉంటుందనీ, అనేక పుష్పాలమీద వ్రాలి, వాటిని ముద్దుపెట్టుకొని, వాని తనువులను పులకరింపజేసే తుమ్మెదల వెంటపడి ఆమె పరుగెత్తుతూ ఉంటుందనీ తెలతెలవారే సమయంలో గుబురుకొని ఉన్న రసాల వృక్షపు చిగురుటాకులను రాచుకొనిపోతూ మధురమైనధ్వనిచేయు పిల్లగాలిలో ఆమె ఆడుకొంటూ ఉంటుందనీ ఇంద్రాణి విన్నది.

ఇంద్రాణి వెంటనే మేఘాలకు కబురుచేసింది. పలుకురాణిని తనవద్దకు పంపమనీ ఆ పిల్ల తన చెలికత్తెలలో ఒకతెగా ఉంటుందనీ!

ఈ సంగతి గాలిదేవుడికి తెలిసింది. ఆయన ఇల్లాగ అనుకొన్నాడు. 'ఇదీ ఒకందుకు మంచిదే. శచీదేవి దగ్గర దేవకన్యలూ వాళ్ళూ ఉంటారు పలుకురాణి వాళ్ళతో కలిసి

మెలిసి తిరగడంవల్ల అమ్మాయికి మర్యాదలూ అవీ తెలుస్తవి. అనేకమంది దేవతలుకూడా అక్కడికి వస్తూ పోతూ ఉంటారు. అమ్మాయి అక్కడ ఉంటే మర్యాదగా ప్రవర్తించడమూ తెలుస్తుంది. వినయమూ, మితభాషిత్వమూ మొదలైన సుగుణాలూ అలవడుతవి' ఇల్లా అనుకొని పలుకురాణిని శచీదేవి వద్దకు పంపాడు గాలిదేవుడు.

పలుకురాణి గాలిదేవుని కూతురేగా ! ఆ అమ్మాయికి తండ్రి గుణాలే అబ్బినవి. గాలిదేవుడికి ఏదైనా రహస్యం చెబితే ఆయన దానిని అందరికీ చెప్పేస్తాడు. బుయ్యిమంటూ పోయి ఏ పుష్పకన్య చెవులోనో ఆ రహస్యం కాస్తా ఊదేస్తాడు. ఆ విషయం అందరికీ తెలిసిపోతుంది. అదీగాక గాలిదేవుడు మాటకారి. ఒక్క క్షణం ఊరుకోలేడు. ఏదో మాట్లాడుతూనే ఉంటాడు. గాలిలో వదిలిన కబురు అందరి! తెలిసిపోతుంది. ఈ రెండు గుణాలూ పలుకురాణికి అబ్బినవి కీ

ఒకసారి శచీదేవి పలుకురాణికి ఏవో కొన్ని రహస్యాలు చెప్పింది. ఆ పిల్ల ఆ సంగతులు అందరికీ చెప్పేసింది. అల్లాగ తన రహస్యాలు అందరికి చెప్పిందని ఇంద్రాణికి తెలిసింది. ఆమెకు చాలాకోపం వచ్చింది. ఇటువంటి కొంటెపిల్ల నా రాణివాసంలో ఉంటానికి తగదు అని చెప్పి ఇంద్రాణి పలుకురాణిని భూలోకానికి పంపివేసింది.

మళ్ళీ పలుకురాణి తల్లి దగ్గరే ఉండటము మొదలు పెట్టింది. ఇప్పుడు పలుకురాణి కాస్త పెద్దపిల్ల అయింది. కాని ఆమె అల్లరి ఎక్కువైంది.

పలుకురాణి ప్రొద్దున్నే నిద్ర లేస్తుంది. గులకరాళ్ళపై జలజలామంటూ ప్రవహించే నిర్మలోదకంలో ప్రొద్దున్నే స్నానము చేస్తుంది... ఆమె ఆకుపచ్చని వలువలు ధరిస్తుంది. తలనిండా రకరకాల పూలు పెట్టుకొంటుంది. తరువాత కిల కిలా నవ్వుతూ సీతాకోకి చిలకల వెంటనో, ఝుమ్మని మోత పెడుతూ పూవు పూవును పలుకరించే తుమ్మెద వెంటనో పడి పరుగెత్తుతుంది.

ఇక ఆ అమ్మాయి చేసే అల్లరికి అంతులేదు కోయిల 'కూ' అని కూస్తే తనూ 'కో, కో' అని వెక్కిరిస్తుంది. చిలుకలు, గోరువంకలు, గిజిగాళ్ళు, వడ్రంగి పిట్టలు, బంగారు పిచ్చికలు వీటిని అనుసరిస్తుంది. చిలక పలుకులు పలుకుతుంది పిచ్చికలలాగ కిచకిచమని ధ్వనులు చేస్తూంది ఆ అడవిలో తిరుగుతూ ఉంటుంది. ఎవ రేమంటే అది మళ్ళీ అనడము ఆ అమ్మాయికి బాగా అలవాటు అయిపోయింది. ఏ పక్షి ఏకూత కూస్తే తనూ అదే కూస్తుంది.

అయితే పలుకురాణి స్వతంత్రంగా ఒక్కమాటకూడా అనలేదు. ఎవరేమంటే మళ్ళీ ఆమాట అనడము మాత్రమే తెలుసు ఆ అమ్మాయికి! పలుకురాణీ! అని పిలిస్తే. పలుకురాణీ అంటుంది. రా అంటే 'రా' అంటుంది. 'పో' అంటే 'పో' అంటుంది. నవ్వితే నవ్వుతుంది ఏడిస్తే ఏడుస్తుంది.

ఇట్లా ఉంటూఉండగా, ఒకరోజున రాణి ఒకచక్కని పిల్లవాణ్ణి చూసింది. ఆ అబ్బాయి ఎంతో అందంగాఉన్నాడు. మంచి శరీరచ్ఛాయ. కోటేరు పోసినట్లు ముక్కు, తళు-

తళుక్కున మెరసే ఆ విశాలమైన కళ్ళు! మందహాస సుందర మైన వదనము!

ఆ అబ్బాయిని చూసీ చూడడంతోనే పలుకురాణి ఒడలు ఝల్లుమన్నది. ఆమె నేత్రాలలోకి కొత్తకాంతులు వచ్చినవి. దేహమంతా తేలిక అయింది. 'ఈ అబ్బాయిని నేను పెళ్ళి చేసుకొంటే ఎంత బాగుంటుంది!' అనుకొన్నది.

అయితే పలుకురాణి ఆ అబ్బాయితో 'ఓ అబ్బాయ్ నిన్ను నేను ప్రేమిస్తున్నాను. మనం ఇద్దరం వివాహం చేసికొందాం' అని అనలేదుగా! స్వతంత్రంగా ఏ మాటా అన లేదామె పాపం! ఎల్లాగూ తన కోరికను ఆ అబ్బాయికి తెలియజేయడము?

తన సంగతి ఇల్లాగఅయిందేనని ఆ అమ్మాయికి దుఃఖం వచ్చింది. పలుకురాణి ఒక కొండగుహలో కూర్చుని ఏడ్చింది. ఆ అడవిలో ఎవరు ఉన్నారు ఆ పిల్లను ఆదరించేటందుకు!

చిలుకలు, గోరువంకలు, బంగారు పిచ్చికలు, గువ్వలు, గిజిగాండ్రు, వడ్రంగిపిట్టలు ఇవన్ని వచ్చి సమీపంలో ఉన్న తమ శాఖలపై కూర్చుని గుడ్లనీరు కుక్కుకొన్నవి. అయ్యో, పాపం అనుకొన్నవి.

లేడిపిల్లలు, జింకపిల్లలూ వచ్చి ఆమెచుట్టూ నిలబడినవి, 'ఆమె ఎందుకు ఏడుస్తున్నదో పాపం, వాటికి తెలియదు. కాని వాటికికూడా దుఃఖం వచ్చింది అవీ ఏడ్చినవి.

పలుకురాణి తన చుట్టూ గుమికూడిన మృగ, పక్షి సంతాన సందోహాన్ని చూచి మరీ దుఃఖించసాగింది. ఆమె కన్నీటి బిందువులు చెక్కిళ్ళమీదుగా జారి, సెలయేటి నీటిలో

బడి టప్పు టప్పుమని శబ్దం చేసినవి. అవి ముత్యాలై పోయినవి. ఆ ముత్యాలు సెలవటిలో పడి దొర్లుకుంటూ వెళ్ళి, ఒక మహానదిని చేరుకొన్నవి. నదీప్రవాహం వాటిని జాగ్రత్తగా తీసికెళ్ళి సముద్రంలో పడేసింది. ఆ ముత్యాలు సముద్రంలో ఉండిపోయినవి. సముద్రంలో ముత్యాలు ఉండడానికి ఇదే కారణం.

ఇంతలో నెమలి ఒకటి వచ్చి పలుకురాణిని అడిగింది. 'ఎందుకమ్మా ఏడుస్తావూ!' అని. పలుకురాణి ఏమీ చెప్పలేక ఊరికే ఆ అబ్బాయి ఉన్న దిక్కుకు చూచి, కళ్ళనిండా నీళ్ళు పెట్టుకుంది. నెమలి తల్లి ఆ అమ్మాయి కడుపులో ఉద్దేశం గ్రహించింది.

నెమలి తల్లి కాసేపు ఆలోచించి ఇల్లా అన్నది... 'చూడూ అమ్మాయి ఏడవకు, ఒక ఉపాయం చెబుతాను విను. నీవు ఆ అబ్బాయి వెంటనే వెళ్ళు. అతను ఎక్కడికి వెడితే నీవు అక్కడికి వెళ్ళు... ఆ అబ్బాయి నీ సంగతి గ్రహిస్తాడు.'

పలుకురాణి సరే నన్నది ఆ అబ్బాయి వెంటనే నడిచింది. ఆ అబ్బాయి కొండ ఎక్కితే తానూ ఎక్కింది ఆయన కొండ దిగితే తానూ దిగింది

కొంతసేపు అయిన తరువాత ఆ కుర్రవాడు, ఎవ రబ్బా ఈ ఈ అమ్మాయి! చక్కని పిల్లనే! ఎందుకో నా వెంట బడ్డది! ఏం కావాలో!' అనుకొన్నాడు.

అల్లాగ అనుకొని ఆ కుర్రవాడు వెనక్కు తిరిగి ఆ పిల్ల వంక చూచి 'ఏ అమ్మాయ్ ఎవరు నీవు?' అని అడిగాడు.

ఆ పిల్ల అతనివంక దీనంగా చూస్తూ 'ఎవరు నీవు?' అన్నది. ఇంకో మాట అనలేదుగా పాపం!

'నేను గొఱ్ఱెల కాపరిని, నాపేరు నార్సికస్ నీ వెవరు?' అని అడిగినాడు ఆ పిల్లవాడు 'నీవెవరవు?' అన్నది ఆ పిల్ల.

నేను అన్నమాటే అంటుందేమిటి ఈ అమ్మాయి! అని అనుకొని ఆశ్చర్యపోయినాడు ఆ అబ్బాయి.

ఎందుకు నా వెంటవస్తావు? అని ఆ పిల్లవాడు అంటే.. ఎందుకు నా వెంటవస్తావు—అని ఆ పిల్ల అన్నది.

'వెళ్ళిపో' అన్నాడు. వెళ్ళిపో అన్నది. నీకేమైనా పిచ్చా అన్నాడు నీకేమైనా పిచ్చా అన్నది. బాగానేవుంది వరస! అన్నాడు. ఆమాటే మళ్ళీ అన్నది ఆ అమ్మాయి.

ఆ అబ్బాయి ఏమన్నా, మళ్లీ ఆమాటే అనేది ఆ పిల్ల. నార్సికస్‌కు విసుగు పుట్టింది కోపంకూడా వచ్చింది. ఈ పిచ్చిదానితో నాకేంపని అనుకొని, ఆ పిల్లవాడు పరుగెత్తడం మొదలుపెట్టాడు. ఆ అమ్మాయి అతని వెంట బడ్డది.

ఆ అబ్బాయికి మరీ కోపంవచ్చి, 'ఛా పో' అన్నాడు. ఆ పిలకూడా ఛా పో అన్నది. దానిమీద నార్సికస్‌కు మరీ కోపంవచ్చి ఆ పిల్లకు అందకుండా పారిపోయాడు. ఆ పిల్ల అతనిని అందుకోలేకపోయింది. చూస్తూవుండగానే ఆ పిల్లవాడు కనబడకుండా పోయినాడు.

ఆ పిల్లకు ఏమి చేయడానికి తోచలేదు. ఎటుపోయినా డబ్బా ఆ అబ్బాయి! ఇటు పోయినాడేమోనని ఉత్తరపు

దిక్కుకు చూచింది. దక్షిణపు దిశ చూచింది. తూర్పుకు చూచింది. పడమరకు చూచింది. ఎక్కడా లేడు ఆ అబ్బాయి అరె! ఏమైపోయినట్లు!

పైకి చూచింది ఆకాశంవైపు. ఆకాశంలోనూ లేడు. భూమిమీద లేడు. అరె! ఏమైనట్లు!

పైగా చుట్టూ కొండలున్నవి. ఆ కొండలలో ఏ గుహలోనో దాక్కుని ఉంటాడు ఆ పిల్ల ఆ అబ్బాయికోసం ఆ కొండలన్నీ వెతికింది. గుహలన్నీ గాలించింది. లోయలన్నీ చూచింది. ఎక్కడా కనుపించలేదు.

పొద్దస్తమానం కొండలలో బడి తిరిగేది. ఆ అమ్మాయి రాత్రిళ్ళు కళ్ళు తెరుచుకు కూర్చునేది... సూర్యోదయం కావడంతోనే మళ్లీ వెతకడం అరంభించేది. ఆ పిల్లవాడు మళ్ళీ కనిపించలేదు.

ఆ అబ్బాయికోసం వెతికింది, వెతికింది. వెతికింది ఎక్కడా ఆ పిల్లవాడి జాడే తెలియలేదు.

ఆ అమ్మాయి పక్షులవంక మృగాలవంక చెట్లచేమల వంక దీనంగా చూచింది.

ఆ పిల్ల ఆ అబ్బాయి వెంటబడి తిరగడం వాళ్ళందరూ చూశారు. ఆ అమ్మాయి సంగతి వాళ్ళందరికీ తెలుసు... ఆ అమ్మాయి దీనమైన ముఖంచూచి వాళ్ళంతా అప్పుడే గ్రహించారు. అతడు ఆమెను మోసపుచ్చి వెళ్ళిపోయినాడని!

గాలిదేముడుకి కూడా తెలిసింది తనకుమార్తెకు జరిగిన అన్యాయాన్ని గురించి, ఆయన ఈ సంగతి అందరికి చెప్పాడు. అందరికీ విచారము కలిగింది.

ఇంకేముంది అడవిఅంతా గోలగోల' అల్లకల్లోలం అయి పోయింది. పక్షులన్ని కిచకిచమని, గిజగిజమని గోలచేసినవి. జంతువు'లన్ని కోపంతో అరచినవి. పెద్దపులులు సింహాలు కోపంతో గాండ్రు గాండ్రుమన్నవి. చెట్లు విచారంతో తల లను నేలకేసి బాదుకొన్నవి. సెలయేర్లు రోదచేస్తూ పరుగెత్తి నవి. అయితే ఏంలాభం మళ్ళీ ఆ అబ్బాయి, ఆ అమ్మాయికి కనిపించలేదు.

పలుకురాణి ఆ పిల్లవాడికోసం బెంగ పెట్టుకొన్నది ఆ బెంగవలన ఆమె ఆహారం తినడము మానేసింది. నీళ్ళు త్రాగడం మానేసింది. 'చిక్కిపోయింది' చిక్కి చిక్కి శల్యం అయిపోయింది. ఒకరోజున ఆ అమ్మాయి చనిపోయింది. చనిపోయిందీ అంటే మనిషిగా కనపడడంలేదు. గాని ఆమె ఆత్మ అక్కడే ఉంది. అప్పటినుండి ఇప్పటివరకు ఆమెఆకొండ ప్రాంతాలలోనే ఉండిపోయింది.

ఇప్పటికీ కొండలున్న ప్రదేశంలోకి మనంవెళ్ళి పిలిస్తే ఆమె పలుకుతుంది. మనం ఏమాట అంటే ఆమాట మళ్లా అంటుంది... ఈ కథ అంతా తెలియనివాళ్లు దానిని ప్రతిధ్వని అంటారు. అంతేకాని శరీరం లేని పలుకురాణ్ణి ఆ కేక వేస్తున్న దనీ మనం అన్నమాట మళ్ళీ అంటున్నదనీ ఎవరికీ తెలియదు.

ఇక ఆ పిల్లవాడి సంగతి ఏమైందీ తెలుసు కొందాము. ఆ పిల్లవాడు ఆఅమ్మాయికి అందకుండా పారిపోయినాడే కాని

ఆ పిల్ల సౌందర్యాన్ని మరచిపోలేక పోయినాడు. ఎప్పుడూ ఆ అమ్మాయే జ్ఞాపకము వస్తూఉండేది. మళ్ళీ ఆ అమ్మాయి కనపడితే బాగుండునని చాలా సార్లు అనుకున్నాడు. చివరకు వెతికి చూద్దామనుకున్నాడు.

నార్సికస్, పలుకురాణి కోసము వెదకడము మొదలు పెట్టాడు. కొండల్లో, లోయల్లో, మైదానాల్లో, నదీతీరాల్లో వెతికాడు. పొదల్లో దాక్కున్నదేమోనని దూరి చూశేవాడు. ఆకుల్లో దాక్కుందేమోనని చెట్లెక్కి చూశాడు. ఎక్కడా కనపడలేదు. పచ్చని పొలాల్లో వెతికాడు. దట్టమైన అడవులను గాలించాడు. ఎక్కడా కనిపించలేదు. ఏదైన మంచి వాసన కొడితే, ఆ అమ్మాయి తలలో పెట్టుకొన్న పూలునుంచే ఆ వాసనలు వచ్చినవి అనుకొనేవాడు. కోయిల కూ అంటే, దానికి ప్రతిగా ఆ పిల్ల పలుకుతుందేమోనని ఆతురతతో ఎదురు చూసేవాడు.

ఇల్లా వెతుకుతూ ఉండంగా కొండలమధ్య ఒక కొలను కనపడ్డది ఆ అబ్బాయికి... ఆ సరస్సులో వికసించిన కలువ పూలు ఎంతో అందంగా ఉన్నవి. ఆ పూలక్రింద పచ్చని ఆకులు నీటిపై పరచుకొని ఉన్నవి. రమణీయంగాఉంది ఆ దృశ్యము.

ఆ అమ్మాయి ఆ ఆకులక్రింద దాక్కున్నదేమోనని సందేహం కలిగింది నార్సికస్‌కు... వెంటనే ఆతడు ఆ సరస్సు ఒడ్డుకు పోయి తొంగిచూశాడు నీళ్ళల్లోకి. ఆ నీళ్ళల్లో తన ప్రతిబింబమే ఆతనికి కనిపించింది. కాని నార్సికసుకు ఆ సంగతి తెలియదు. తన ముఖం ఎట్లా ఉంటుందో ఆతనికి తెలియదు.

నీళ్ళల్లోకి చూస్తే తన ముఖము యొక్క ప్రతిబింబము కనపడుతుందన్న విషయమే ఆతనికి తెలియదు. కాబట్టి అతను ఏమను కొన్నాడూ అంటే, నీళ్ళల్లో కనిపిస్తున్నది ఆ అమ్మాయి ముఖమే అనుకొన్నాడు. తాను ఎవరికోసమై వెతుకుతున్నాడో ఆ నీళ్ళల్లో దాక్కున్నదనీ అనుకొన్నాడు.

నార్సికస్ ఒడ్డున నుంచుని నీళ్ళల్లోకి నిదానంగా చూశాడు, ఆ పిల్ల మొఖంవంక నీళ్ళల్లోనుంచి ఆ పిల్ల తేలినది నిదానంగా చూస్తున్నట్లు తోచింది అతనికి.

నార్సికస్ నవ్వాడు. నీళ్ళల్లో ఉన్న పిల్లకూడా, నవ్వింది. ఇంకేం ! ఆ అమ్మాయి నీళ్ళల్లో దాక్కొన్నది. తనవంకచూచి నవ్వుతున్నది. అని అనుకున్నాడు నార్సికస్.

ఆ పిల్ల చక్కని ముఖం చూస్తూ ఉండిపోయినాడతడు. ఆపిల్లకూడా తననుచూస్తూ ఉండిపోయిందనుకున్నాడు. నార్సికస్‌కు సంతోషం కలిగింది. అమ్మదొంగ ఇక్కడున్నావా బయటికిరా అనిఅనుకొంటూ ఆపిల్లనుపట్టుకోవాలెననినీళ్ళల్లో చెయ్యిపెట్టాడు. నీళ్ళు కెలికినట్లుఅయింది. ఆ అమ్మాయిమాయమైంది

ఆ అబ్బాయి ఇల్లాగఅనుకొన్నాడు—ఈ పిల్ల సామాన్యపు పిల్లకాదు. దేవకన్య లేకపోతే జ ల క న్య... జలకన్యలు చాలా అందమైనవాళ్ళు వాళ్ళ ఇళ్ళు నీటి అడుగున ఉంటాయి. వాళ్ళు అప్పుడప్పుడు పైకి వస్తూ ఉంటారు.

'ఆ పిల్లను లాక్కుని వెళ్ళడానికికాని ఎత్తుకొని పోవడానికికాని ప్రయత్నం చేయకూడదు. అటువంటి ప్రయత్నం చేస్తే ఆ కన్యలు పారిపోయి నీటి అట్టడుగున ఉన్న ఆరు అంతస్తుల మేడలో దాక్కుంటారు. ఒకసారి అల్లాగ వెళ్ళి

పోయి దాక్కున్నారా, ఇక వాళ్ళను పైకి రప్పించడం ఎవరి తరముకాదు' ఈ సంగతులన్నీ జ్ఞాపకం వచ్చినవి నార్సికసుకు.

ఆ జలకన్యలు ఉన్నమాట నిజమే. వారిని గురించి. ఎన్నోకథలు పెద్దవాళ్ళు చెప్పగా తాను చిన్నప్పుడు విన్నాడు నీటిఅడుగున రత్నాలతోనూ, పగడాలతోనూ, ముత్యాల తోనూ కట్టిన మేడలలో వాళ్ళు ఉంటారు సగం చేప సగం మనిషి ఆకారంగల స్త్రీలు ఎంతో మంది ఈ జలకన్యలకు ఒరి చారకులుగా ఉంటారు. ఇటువంటి సంగతులు ఎన్నో అతనికి జ్ఞాపకం వచ్చినవి.

ఈ అమ్మాయి నాకు మొదటిసారి కనుపించినపుడే మర్యాదగా మాట్లాడాల్సింది. ఏదోపిచ్చిది అనుకొన్నాను. ఎంత పొరపాటు అయింది? ఇప్పుడైనా ఆ పిల్లను ఏదో విధంగా మంచి చేసుకోవాలె అని నిశ్చయించుకొన్నాడు నార్సికస్.

ఇహ ఆ పిల్లను మాట్లాడిద్దామనుకొని అతడు "ఓయ్ చూడు" అన్నాడు ఓయ్ చూడు అన్నమాటలు వినిపించినవి.

పలుకురాణి ఆ కొండ ప్రదేశాలలో ఉందన్నసంగతి మనకు తెలుసుగా, ఆ పిల్ల మనిషిగా కనుపించదుగాని మనం అన్నమాట మళ్ళీ అనడము మానలేదుగా!

అయితే ఆ పిల్ల ఆ కొండల్లో అక్కడే కనపడకుండా ఉంటున్నదని నార్సికస్‌కు తెలియదు. అతడు ఏమనుకున్నా డంటే, ఆ పిల్ల నీళ్ళల్లో ఉందనీ ఆ అమ్మాయ్ అట్లా మాట్లాడుతున్నదనీ.

అక్కడ ఉన్నావా అన్నాడు నార్సిసస్. 'అక్కడ ఉన్నావా?' అన్నది ఆ పిల్ల, అంటే ఆ పిల్లే అంటున్నట్లు ఆతనికి తోచింది.

'బయటికిరా' అన్నాడు. బయటికిరా అన్నది ఆపిల్ల. నీవు అందంగా ఉన్నావు అన్నాడు నీవు అందంగా ఉన్నావు! అన్నది.

ఈ మాటలు విని నార్సిసస్ చాలా సంతోషించాడు. తాను అందంగా ఉన్నట్లు ఆ పిల్ల ఒప్పుకొన్నట్లేగా! నేను నిన్ను పెండ్లాడుతాను అన్నాడు. నేను నిన్ను పెండ్లాడుతాను అన్నది.

నార్సిసస్ సంతోషంతో పొంగిపోయినాడు. పాపం ఆతనికి నీళ్ళల్లో కనబడుతున్నది తన ముఖ ప్రతిబింబమనీ కొండల్లో ఎవ్వరికీ కనపడకుండా ఉన్న పలుకురాణి తను అన్న మాట మళ్ళీ అంటున్నదనీ తెలియదు. నీళ్ళల్లో ఒక పిల్ల ఉందనీ, ఆ పిల్ల మాట్లాడుతూ ఉందని అనుకొంటున్నాడు.

నార్సిసస్ ఇట్లా చాలాసేపు మాట్లాడాడు. కాని ఎంత సేపటికి ఆ అమ్మాయి బయటకు రాకపోయేసరికి విసిగి ఆపిల్లను పట్టుకొందామని చూశాడు. పట్టుకుందామని నీళ్ళలో చెయ్యి పెడితే ఆపిల్ల మాయమౌతుంది. ఎన్నోసార్లు ఇల్లాగ ఆ పిల్లను పట్టుకొందామని ప్రయత్నం చేయడమూ, ఆ పిల్ల కనబడకుండా పోవటమూ జరిగింది.

ఇక లాభము లేదనుకొన్నాడు. ఆ పిల్లను పట్టుకొంటానికి ప్రయిత్నం చేయకూడదనినిశ్చయించుకొన్నాడునార్సికస్. ఆ చక్కని పిల్ల ముఖం చూస్తూఉంటే అంతే చాలునను కున్నాడు.

అంతే నార్సికసే ఆ పిల్లను చూస్తూ ఉండిపోయినాడు. కదలలేదు మెదలలేదు. అన్నపాదులు లేకుండా అల్లాగ ఉండి పోయినాడు. క్రమంగా ఆతడు శుష్కించి చనిపోయినాడు. అతని శరీరం ఆ సరస్సు ఒడ్డుననే భూమిలోకికూరుకుపోయింది. కొన్నాళ్లు అయినతరువాత అక్కడ ఒకచక్కని పూలమొక్క మొలిచింది. వానలు కురవడంతోనే ఆ మొక్కపుష్పించింది. ఆ పువ్వు అన్ని పువ్వులలాగ తలెత్తుకొని సూర్యుని చూస్తూ ఉండదు. తలవంచుకొని నీళ్లల్లో తన ప్రతి బింబాన్ని చూస్తూ ఉంటుంది. అదే నార్సికసు పుష్పము. పలుకురాణి ఆత్మ ఇప్పటికీ కొండలున్న ప్రదేశాలలో తిరుగుతూ ఉంటుంది. అక్కడికివెళ్ళి మనము ఏ మాట అన్నామంటే ఆమాట మళ్ళీ అంటుంది. దానినే ప్రతిధ్వని అంటారు.

—o—